జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 8-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 157 పేజీలు: 8 వెల : రూ.7

# తీరం.. సురక్షితమేనా?



**శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న సముద్ర తీరంలో ప్రజల రక్షణకు ఏర్పాటు చేసిన మెరైన్ పోలీస్‌స్టేషన్లు రికమెండేషన్, పనిష్‌మెంట్ స్టేషన్లుగా మారిపోయాయి. సముద్రంలో ఈదగలిగే సత్తా, విపత్తు సమయంలో తీర ప్రాంత ప్రజలకు రక్షించగలిగే వారిని, సముద్ర జలాల ద్వారా తీరంలోకి ముష్కరులు రాకుండా అడ్డుకునే యువ పోలీసులను మెరైన్ స్టేషన్లకు నియమించకుండా, పనిష్మెంట్, దూర ప్రాంతాలకు బదిలీ అయిన తర్వాత తమకున్న సంబంధాలు, పరిచయాల ద్వారా ఈ స్టేషన్లకు బదిలీ అయినవారే ఎక్కువ అన్న విమర్శలు ఉన్నాయి. ఉన్న సిబ్బందిలో అధికమందికి ఈతకూడా రాదు. తీర ప్రాంతాన్ని, ప్రజలను వీరెలా రక్షిస్తారో ఆ పెరుమాళికే ఎరుక.**




*** మెరైన్ పోలీస్‌స్టేషన్లలో అరకొర సిబ్బంది * అక్కడి పోలీసులకు శిక్షణ అంతంత మాత్రమే * ఈతరాని వారికి అక్కడ విధులేంటో? * విపత్తు సమయంలో మత్స్యకారులే దిక్కు * కేవలం గస్తీ, పెట్రోలింగ్‌కే పరిమితం**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 7 (వార్త):** మన దేశంలోకి ముష్కరులు అడ్డదారిలో సముద్ర మార్గం ద్వారా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంటారు. అటువంటి చర్యలను పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ మెరైన్ పోలీసులను రంగంలోకి దింపింది. తీర ప్రాంతం రక్షణ, అక్కడికి వచ్చే సందర్శకుల భద్రత, బీచ్‌ల్లో పెట్రోలింగ్, గస్తీతో పాటు తుఫాన్ సమయంలో మత్స్యకారులను అప్రమత్తం చేయడం, సంద్రంలో చిక్కుకున్న వారిని రక్షించడం వీరి బాధ్యత.

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సుమారు 190 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. కళింగపట్నం, భావనపాడు, బారువ తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పీఎస్‌లో సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హెూంగార్డులు విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఈ మెరైన్ పోలీస్‌స్టేషన్లకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీనివల్ల ఉన్న సిబ్బందిపై పనిభారం ఎక్కువ అవుతోంది. దీంతో సక్రమంగా పనిచేయలేకపోతున్నారు. ఈ స్టేషన్లలో ఎక్కువగా వయస్సు మళ్లినవారే విధులు నిర్వహిస్తున్నారన్న టాక్ ఉంది. ఈ స్టేషన్లలో పనిచేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ప్రశాంతంగా ఉండవచ్చని భావించి కొందరు ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. తిన్నామా.. పడుకున్నామా.. తెల్లారిందా అన్న భావనలో పలువురు విధులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల పనిచేసే మిగతా వారిపై పనిఒత్తిడి ఎక్కువగా ఉంటోందని తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెరైన్ పోలీసులు, అధికారులు ఈ స్టేషన్లకు పదికిలోమీటర్ల పరిధిలో ఉండాలి. అయితే చాలామంది జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు చేస్తున్నారు.

మెరైన్ పోలీస్‌స్టేషన్లలో పనిచేసే సిబ్బందిలో ఎక్కువమందికి ఈత రాదు. కేవలం హెూంగార్డులకు తప్ప మిగతా ఎవరికీ ఈతలో నైపుణ్యం లేదు. కొందరికి ఈత వచ్చినా సముద్రంలో ఈదగలిగేటంతటి సామర్థం లేదు. మెరైన్ సిబ్బందికి సరైన ఈతలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వకపోవడంతో విపత్తుల సమయంలో మత్స్యకారులపై ఆధారపడాల్సివస్తోంది. దీనికితోడు ఈ మెరైన్ పోలీస్‌స్టేషన్లలో బోట్లు కూడా లేవు. ఉన్నవి పాడుబడిపోయాయి. దీంతో విపత్తుల సమయంలో విశాఖ నుంచి బోట్లు తెప్పించడం, లేకుంటే మత్స్యకారులకు సంబంధించిన బోట్లను వినియోగిస్తున్నారు.

**తీరంలో గస్తీ పెంచండి: విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**

బారువ మెరైన్ పోలీస్ స్టేషన్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తనిఖీ చేశారు. తీర ప్రాంత ముందస్తు సమాచార సేకరణ విషయమై ఆరా తీశారు. తీర ప్రాంతాల్లో గస్తీ పెంచాలని ఆదేశించారు. సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు.

# అత్యాశకు పోయి మోసపోవద్దు



*** ఉచితంగా డబ్బులు ఎవరూ ఇవ్వరు**
*** సైబర్ నేరాలపై అప్రమత్తం**
*** పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి**
*** విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**
*** మందస, సోంపేట, బారువ పీఎస్‌ల సందర్శన**

**మందస/సోంపేట, నవంబర్7 (వార్త):** వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ గ్రోపీనాథ్ జట్టి గురువారం శ్రీకాకుళం జిల్లా మందస పోలీస్ స్టేషన్, సోంపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా స్థానిక పోలీసు సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం మందస పోలీసు స్టేషన్, సోంపేట సర్కిల్ కార్యాలయంలో ఆవరణల్లో మొక్కలు నాటారు. కేస్ సిడి ఫైలు రికార్డులను పరిశీలించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు ముఖ్యమైన కేసులు దర్యాప్తుపై ఆరా తీసి, సమగ్రమైన విచారణతో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మందస మండలంలోని నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి మీడియాతో మాట్లాడుతూ వార్షిక తనిఖీలలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో మందస పోలీస్ స్టేషన్, సోంపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించానన్నారు. పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాలంలో శ్రీకాకుళం జిల్లాలో కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాల సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఇలాంటి సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలను అనేక విధాలుగా ప్రలోభాలు పెట్టి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకోవడం జరుగుతోందని జాగ్రత్తగా ఉండాలన్నారు. సిబిఐ, సిఐడి పోలీసులు అంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను నమ్మించి సైబర్ మోసాలు చేస్తుంటారని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. తక్కువ



సమయంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలని, ఓటిపి, గుర్తింపు లేని లింకులు, గుర్తింపు లేని ఫోన్ కాల్స్ ద్వార సైబర్ నేరగాళ్లు ఆన్లైన్ ద్వారా మోసాలు చేస్తుంటారన్నారు. ఇతర రాష్ట్రాలు ,విదేశాలలో చదువుతున్న పిల్లలు వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లలు డ్రగ్స్, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కేసులలో బాధితులుగా ఉన్నారని బెదిరించి, నమ్మించి మోసం చేసి కొంత నగదును బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్సర్ చేయాలని కోరుతుంటారని తెలిపారు. ఆధార్ అడ్రస్ అప్డేట్ చేయాలని కోరి అప్డేట్ చేసిన తర్వాత ఆయా చిరునామా పేరిట మాదక ద్రవ్యాల పార్సెల్ బుక్ చేశారని భయపెట్టి నగదును కాజేస్తారని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఉండాలని ఉచితంగా ఎక్కడ నగదు రాదని, అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోకూడదని హితవు పలికారు. ప్రలోభపెట్టే సందేశాలు, ఫోన్ కాల్స్ గాని వచ్చినట్లయితే వెంటనే 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ గాని, నేషనల్ కస్టమర్ హెల్ప్ లైన్ (1800-11-4000), సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (cyber-crime.gov.inలో వివరాలు నమోదు చేసి, సంబంధిత స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర్ రెడ్డి, అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, సీఐలు తిరుపతిరావు, మంగ రాజు, మెరైన్ సీఐ డివిజే రమేష్ కుమార్, ఎస్సైలు ఉన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు మినీ జాబ్‌మేళా

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల దివ్యాంగులతో పాటు అర్హత, ఆసక్తి కలిగిన గల నిరుద్యోగ ఉద్యోగ యువతకు మినీ జాబ్ మేళా కార్యక్రమాన్ని స్థానిక నెహ్రూ కేంద్రం, శ్రీకాకుళంలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మినీ ఉద్యోగ మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నారు. యువత వారి వారి విద్యార్హత పత్రాలు నకలు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరయ్యి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9550967353, 7793454256 నెంబర్లు సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించి రిజిస్టర్ కావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.

### కూటమి ప్రభుత్వంతో..

# మహిళల ఆర్థికాభివృద్ధి

* ఎమ్మెల్యే గొండు శంకర్
* దమ్మలవీధిలో సిలిండర్ల పంపిణీ



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** మహిళలకు ఆర్థికంగా చేయూతనందించడంతోపాటు ప్రతి ఇంటిలో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం దీపం పథకానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని దమ్మలవీధిలో దీపం పథకంలో భాగంగా గ్యాస్ సిలెండర్లను ఎమ్మెల్యే శంకర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారన్నారు. దీపం-2 పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్నారు. నాలుగు మాసాలకు ఒకటి చొప్పున సంవత్సరానికి మూడు సిలిండర్లు పేద మహిళలకు ఉచితంగా అందుతాయని చెప్పారు. దీనిపై అందరూ అవగాహన చేసుకొని ఎక్కడ దరఖాస్తు చేయవలసిన పనిలేదని ఆధార్ కార్డు ఇవ్వాల్సిన అవసరం లేదని ఇప్పటికే గ్యాస్ కనెక్షన్‌కు మీ ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ లింక్ అయి ఉన్నందున ఆటోమేటిక్‌గా ప్రభుత్వం ద్వారా అర్హులైన వారందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ లబ్ధిచేకూరుతుందన్నారు. మీరు గ్యాస్ బుక్ చేసుకుని డెలివరీ సమయంలో సిలిండర్ ధరను చెల్లిస్తే ఆ సొమ్మును 48 గంటల్లోగా తిరిగి వారి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. సంవత్సరానికి మూడు సిలిండర్లకు పెట్టే ఖర్చు ప్రభుత్వం తిరిగి చెల్లించడం వల్ల ప్రతి పేద ఇంటికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ప్రభుత్వం చక్కటి ఆలోచనతో సూపర్ సిక్స్‌లో భాగంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే గ్రామ వార్డు సచివాలయంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అభివృద్ధి.. ప్రభుత్వ లక్ష్యం



* ఎమ్మెల్యే గొండు శంకర్
* శ్రీకాకుళం నుంచి పలాస పాసింజర్ బస్సు ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** ఆర్టీసీ అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం నుంచి పలాస వెళ్లే పాసింజర్ బస్సును గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థమే రాష్ట్రవ్యాప్తంగా బస్సులను వేస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త బస్సుల ద్వారా ఆర్టీసీ సేవలను మరింత విస్తృత పరుస్తున్నామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా వేయలేదన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆర్టీసీని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యతన్నారు. సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఆర్టీసీ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయం పెంచేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్ కుమార్‌చ, శ్రీకాకుళం 1,2వ డిపో మేనేజర్లు అమర సింహుడు, శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు రమేష్, గంగరాజు, స్టేషన్ మేనేజర్ యం.పి.రావు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు శ్రీను, సిమ్మయ్య, పీఆర్వో సుమన్, అన్ని అసోషియేషన్ల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికే పంచాయతీ వారోత్సవాలు

* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస, నవంబర్7 (వార్త):** గ్రామాల అభివృద్ధికే రాష్ట్ర ప్రభుత్వం పల్లెవెలుగు పంచాయతీ వారోత్సవాలను నిర్వహిస్తోందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం చీమలవలస గ్రామంలో పల్లె వెలుగు పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి నిధులు 73లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలో నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.చల్లం నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నూకరాజు, సనపల్లి ఢిల్లీ, తమ్మినేని చంద్రశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి ప్రణాళికలు చేయండి

సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా

* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* గాంధీ మందిరంలో ఆచార్య ఎన్జీ రంగా విగ్రహావిష్కరణ



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** గాంధేయవాదిగా స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఆచార్య ఎన్జీ రంగా రైతు కూలీల కోసం తమ జీవన పర్యంతం గళమెత్తి రైతు బాంధవునిగా పేరుగాంచారని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. రాజకీయ పాఠశాల ప్రారంభించి ఎందరికో రాజకీయ గురువుగా నిలిచిన స్ఫూర్తిదాత అని కొనియాడారు. ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల సంఘ సంస్కర్తల స్మృతివనంలో విగ్రహదాతలు మాజీమంత్రి త్రిపురాన వెంకటరత్నంతోపాటు ఎమ్మెల్యే గొండు శంకర్ కలిసి నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాతో రంగాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. పార్లమెంట్ సభ్యునిగా 60 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించి గిన్నీస్ రికార్డు నెలకొల్పిన ఏకైక వ్యక్తి అని కొనియాడారు. జిల్లా నుంచి ఒకసారి పార్లమెంట్ సభ్యునిగా సేవలందించి ప్రజల మదిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని పేర్కొన్నారు. మానవీయ విలువలకు పోరాట స్ఫూర్తికి ఎనో రంగా ప్రతిరూపంగా నిలుస్తారని ఎమ్మెల్యే చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో మహనీయుల స్ఫూర్తి భావితరాలకు అందేలా చేస్తున్న కృషి ఎంతో గొప్పదని మాజీమంత్రి త్రిపురాన వెంకటరత్నం అన్నారు. అనంతరం విగ్రహదాత త్రిపురాన వెంకటరత్నం, ఎమ్మెల్యే గొండు శంకర్లను గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా కప్పి సత్కరించారు. అవధాన పండితులు పైడి హరనాథరావు ఎన్జీ రంగా గొప్పతనాన్ని కీర్తిస్తూ గేయాన్ని ఆలపించారు. తొలుత గాంధీ మందిరంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్, పందిరి అప్పారావు, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, మహిబుల్లాఖాన్, ఎంవివిఎస్ శాస్త్రి, పెంకి చైతన్య, టెక్కం రాంగోపాల్, టీడీపీ నాయకులు రొక్కం భాస్కర్, రౌతు సంతోష్, రమణ పాల్గొన్నారు.

# కాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

* ప్రముఖ వైద్యులు కనుగుల సుధీర్
* రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జాతీయ కాన్సర్‌పై అవగాహనా ర్యాలీ

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** కాన్సర్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని, మొదటి దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తే కాన్సర్‌ను జయించవచ్చని ప్రముఖ వైద్యులు కనుగుల సుధీర్ అన్నారు. స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ పరిపాలన విభాగంలో జాతీయ క్యాన్సర్ అగాహన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్యుడు సుధీర్ మాట్లాడుతూ దేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో మొదటి స్థానం గుండె జబ్బులనిదని, తరవాత స్థానం క్యాన్సర్‌దేనన్నారు. క్యాన్సర్ బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి వ్యాధి ముదిరిన తరవాతే ఇది నిర్ధారణ అవుతోందని, అందువల్ల బతికే అవకాశాలు తగ్గిపోతున్నాయని, దీనిపై సరైన అవగాహన లేక క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అవగాహన లేక పోవడం, నిరక్షరాస్యత, భయం, వివిధ రకాల అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యం అవుతోందని తెలిపారు. అలాగే పొగాకు, మద్యపానం, ఊబకాయం, ఆహారపు అలవాట్లు, ఇన్ఫెక్షన్లు ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశాలు మెండని, మన దేశంలో క్యాన్సర్ కారకాలలో 70 శాతం నివారించదగినవేనన్నారు. 40 శాతం పొగాకుకు సంబంధించినవి, 20 శాతం ఇతర వ్యాధుల వల్ల కలిగేవి, 10 శాతం ఇతర కారణాల వల్ల సంభవించే క్యాన్సర్లన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ అనారోగ్యకర ఆహారపు అలవాట్లను ప్రతీ ఒక్కరు మార్చుకోవాలని, అధిక కొవ్వు పదార్థాలు, ముఖ్యంగా సాల్టెడ్ ఫుడ్స్ తినడం, తక్కువ పండ్లు, కూరగాయలు తినే అలవాట్ల వల్ల అనేక రకాల క్యాన్సర్లు చుట్టే ముట్టే ముప్పు ఉందని, పొగాకు తాగడం, నమలడం, నషం పీల్చడం పూర్తిగా మానేయాలని, ఆ వ్యసనం నుంచి బయట పడటానికి అవసరమైతే వైద్యుల సహాయం తీసుకోవాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, శారీరకంగా చురుకుగా ఉండటంతో పెద్దపేగు, రొమ్ము, ఎండోమెట్రియల్ క్యాన్సర్‌ల ముప్పులను తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. అనంతరం కాన్సర్ పై అవగాహన ర్యాలీని రెడ్ క్రాస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు ప్రారంభించి, రెడ్‌క్రాస్ పరిపాలన విభాగం నుండి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ఎంసీ మెంబెర్ కళ్యాణ్, చిన్మయరావు, ఏవో నర్సింగరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, పీఆర్వో పెంకి చైతన్య, బి.సతీష్, గుణాకర్, ఎపిఆర్వో ఉమా శంకర్, ప్రతినిధులు హర్ష, సుజాత, వెంకట రమణ, యోగ రామారావు, అరుణ, సంతోషి, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం










# అశోక్ ది.. గ్రేట్

* ఎమ్మెల్యే అశోక్ బాబుకు సీఎం ప్రశంస * సీఎం చంద్రబాబు ప్రకటన విజయవంతం చేసిన బెందాళం * ఏ గ్రామం ఎంపిక నుంచి ప్రోగ్రాం సక్సెస్ అయ్యే వరకు * ఈశాన్యంలో ఈదుపురంతోనే గుడ్ మౌత్ టాక్ * అశోక్ వ్యూహ చతురతకు సభాస్థలి ఎంపికే నిదర్శనం * రాజకీయ ప్రత్యర్థులను మడతెట్టేసిన నిర్ణయం * కలెక్టర్, ఎస్పీ పూర్తి స్వేచ్ఛ సహకారం * ప్రతి అంశం లోను అశోక్ మార్క్ * సీఎంఓ అధికారులను కూడా ఒప్పించుకున్న వైనం * అశోక్ అల్లాడించాడంటూ కేడర్ ఉత్సాహం * సీఎం సభ విజయవంతంతో ఆనందంలో తమ్ముళ్లు * సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే

(ఇచ్ఛాపురం - వార్త)

ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన సూపర్ సిక్స్‌లోని దీపం పథకం-2. ఈశాన్యంలోని ఈదుపురంలో ఈ నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ ప్రెస్టేజియస్ కార్యక్రమానికి ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ బాబు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా నిర్వహించిన ఎమ్మెల్యే అశోక్ బాబును సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. దాదాపు ఆరు రోజులు అవిశ్రాంతంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జెసి ఫర్మాద్ అహ్మద్ ఖాన్‌లను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాలోచనలు చేస్తూ కష్టపడితే వచ్చిన ఫలితమిది..!! జిల్లాలో అశోక్ బాబు సీనియర్ ఎమ్మెల్యే కావడంతో కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లను పరిశీలన చేసేందుకు ఒక్క శాసన సభ్యులు కానీ, మంత్రిగాని, చివరకు జిల్లా అధ్యక్షులు గాని నియోజకవర్గ మొహం చూడలేదు..!! అయినప్పటికీ, అంతా తానై అధికారుల అండగా సీఎం కార్యక్రమం నియోజకవర్గంలో లిఖించుకునే విధంగా అద్భుతమే చేసి అందరినోట అశోక్ ది గ్రేట్ అనిపించుకున్నారు.

జిల్లా పర్యటనకు ముఖ్యమంత్రి ఉత్సాహం చూపుతున్నట్టు ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులకే ఒక ప్రకటన వచ్చింది. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మన నియోజకవర్గము నుంచే శ్రీకారం చుట్టేందుకు రాజపురం వేదికను సన్నద్ధం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో ఆ పర్యటన అర్థాంతరంగా రద్దు అయింది. అక్కడికి కొద్ది రోజులలోనే ఈ దీపం పథకం ప్రారంభోత్సవ అవకాశం మళ్లీ మనకే దక్కింది. అయితే, ఈసారి కార్యక్రమం నిర్వహణ ఎక్కడ అనే అంశంపై విపరీత చర్చలు జరిగాయి. కవిటి మండలంలో నిర్వహించాలని అక్కడ నేతలు, సోంపేటకు అవకాశం ఇవ్వాలని ఇక్కడ నేతలు, నియోజకవర్గ కేంద్రానికి తరలించాలని అక్కడ తమ్ముళ్లు, కంచిలి మండలం అనుకూలంగా ఉంటుందని ఇలా దేశం నేతలు ఎమ్మెల్యే పై ఒకరకంగా ఒత్తిడి తీసుకువచ్చారు. అందులో భాగంగా అన్ని మండలాలలో అనుకూలమైన స్థల పరిశీలన అక్కడ నాయకత్వంతో కలిసి చేపట్టారు.

## అశోక వ్యూహం...

ఒక దశలో కలెక్టర్, ఎస్పీ కంచిలి మండలం పద్మతుల గ్రామాన్ని దాదాపు ఖరారు చేశారు. అయితే, ముఖ్యమంత్రి కార్యక్రమం పార్టీకి ఎంతో మేలు చేయాలనేది రాజకీయ వ్యూహం. అందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే తన రాజకీయ చతురతతో వేదికను ఈశాన్యంలో ఉన్న వాస్తును వాడుకొని, అధికారులను ఒప్పించి ఈదుపురానికి మార్చుకుని తన రాజకీయ వ్యూహాన్ని అమలుపరిచారు. ఈదుపురం వేదికతో ఇచ్ఛాపురం, మునిసిపాలిటీ, కవిటి మండలం , మత్స్యకార గ్రామాలు సరిహద్దులుగా దాదాపు 40 వేల ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఈదుపురం కూడలని ఎంపిక చేశారు. నిజానికి ప్రత్యర్థి పార్టీ ఈదుపురంలో బలవంతంగా ఉండేది. నిన్నటి సార్వత్రిక ఎన్నికలు మినహాయిస్తే, ఏ ఎన్నిక జరిగినా దాదాపు పాత కాంగ్రెస్, కొత్త వైకాపాకు అక్కడ ప్రజలు మద్దతు పలికేవారు. కానీ మొన్నటి ఎన్నికలలో అశోక్ కు బ్రహ్మరథం పట్టారు. దీంతో అక్కడ పార్టీ జెండాను గర్వంగా ఎగరేసేందుకు వచ్చిన అవకాశాన్ని ఎమ్మెల్యే అందిపుచ్చుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అధికారులతో ఆరోగ్యకరమైన యుద్ధము చేసి ఈదుపురానికి ముఖ్యమంత్రిని తీసుకువచ్చారు. సభ వేదిక గ్రామముతోనే కార్యక్రమం 50 శాతం విజయవంతం అనే ప్రచారాన్ని పాజిటివ్ మౌత్ టాక్ తో దూసుకెళ్లింది.

## నాలుగు దిక్కులు దద్దరిల్లేలా...

ఈదుపురం గ్రామానికి తూర్పు దిక్కున బూర్జపాడు, డొంకూరు, సన్యాసి పుట్టుక, లక్ష్మీపురం, కేశపురం, నెలవంక పడమర వైపు కొఠారి, పూర్ణాటకం, పత్రిపుట్టుగ తదితర గ్రామాలు కలుస్తున్నాయి. ముఖ్యమంత్రి వేదికకు ఉత్తర దిక్కున తిప్పనపుట్టుగ, జల్లు పుట్టుగ, ముత్యాల పేట, కవిటి మండల కేంద్రంతోపాటు మేజర్ పంచాయతీ దక్షిణ దిక్కున పరిశీలిస్తే, బెల్లుపడ, మున్సిపాలిటీ పరిధిలోకి వస్తాయి. వేదిక కేంద్రంగా నాలుగు దిక్కులు గరిష్ట దూరం ఐదు కిలోమీటర్ల పరిధిలో ఇన్ని గ్రామాలు ముఖ్యమంత్రి సభకు కలిసివచ్చే అవకాశం ఏర్పడింది. అదేవిధంగా, రాజకీయంగా తనకు, తన పార్టీకి ఈ కార్యక్రమం ద్వారా అనుకూలంగా మార్చుకునేందుకు గొప్ప ఎత్తుగడే ఎమ్మెల్యే వేశారు. తన రాజకీయ ప్రత్యర్థులకు చెక్ పట్టే విధంగా, ముఖ్యమంత్రినే వారి జాగాకు తీసుకువచ్చి సభను దిగ్విజయం చేసుకుని ఎమ్మెల్యే తన కెపాసిటీని చూపించారు. ఇచ్ఛాపురం మండలానికి గుండెకాయ లాంటి ఈదుపురం, సరిహద్దులన్నింటినీ కలిపి దాదాపు 40 వేల ఓటు బ్యాంకు పై దృష్టి సారించారు. స్థానిక సంస్థలకు ప్రజాబలాన్ని మద్దతును కూడగట్టారు. మైనర్ పంచాయతీకి ఎక్కువ, మేజర్ పంచాయతీకి తక్కువగా ఉన్న ఒక్క ఈదుపురంలోనే దాదాపు పదివేల జనాభాతో పాటు, మొన్నటి ఎన్నికలలో 5000 వరకు ఓట్లు పోలయ్యాయి. ఈ పరిస్థితులలో తెలుగుదేశం పార్టీ అక్కడ పుంజుకునే విధంగా ఈ కార్యక్రమం దోహద పడింది. ప్రస్తుతం ఉన్న రెండు ఎంపీటీసీలు, సర్పంచ్ పదవులు ప్రత్యర్థులకే ఉన్నాయి. తాజా జడ్పిటిసి సభ్యురాలు కూడా ఈదుపురం గ్రామానికి చెందిన వ్యక్తి. మాజీ జెడ్పిటిసి కూడా ఆ గ్రామానికి చెందిన వ్యక్తి. రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నరేంద్రది కూడా ఈదుపురం. ఒక ముఖ్యమంత్రి సమావేశం తో ఈదుపురానికి వరాలు కురిపించి, తెలుగుదేశం పార్టీ.. మరి ముఖ్యంగా అశోక్ బాబు నాయకత్వాన్ని మరో రెండు దశాబ్దాలు ఈదుపురంలో తిరుగులేని విధంగా ముఖ్య మంత్రి ద్వారా ప్రకటనలు తెప్పించుకుని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకున్నారు.

## ఒంటి చేతితో కార్యక్రమం.. అది అశోక్ పవర్

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ముఖ్య మంత్రి పర్యటన ఉంటుందని ఐదు రోజుల వ్యవధిలో ప్రకటన వచ్చింది. ఒకటిన్నర రోజులోనే సభా ప్రాంగణ వేదిక గ్రామాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే పూర్తి చేశారు. అక్కడకు రెండు రోజుల్లోనే అంటే గరిష్టంగా మూడున్నర రోజులలో సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ నిర్మాణాన్ని, లబ్ధిదారుల ఎంపికను రూట్ మ్యాప్ ను సీఎంఓ అధికారులు వచ్చేలోగా దాదాపు వారి సలహాలు సూచనలతో 90 శాతం పూర్తి చేసేశారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గరుండి మూడు రాత్రులు 10 గంటల వరకు కలెక్టర్ , ఎస్పీని సమన్వయం చేసుకుంటూ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేస్తూ ఇద్దరు జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసుకున్నారు. నిజానికి కలెక్టర్, ఎస్పీకి తొలి పోస్టింగులు కావడం, ముఖ్యమంత్రి పర్యటనను నిర్వహించిన అనుభవం లేనప్పటికీ.. సీనియర్ ఎమ్మెల్యేగా గతంలో చంద్రబాబు, లోకేష్ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవంతో వారిని మార్గ నిర్దేశం చేసుకుంటూ ఎవరి ప్రమేయం లేకుండానే సీఎం సభను అశోక్ బాబు జయప్రదం చేసుకున్నారు. సీఎం సభ ఏర్పాట్ల పరిశీలనకు జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే గాని, మంత్రిగాని, కేంద్ర మంత్రిగాని, చివరికి పార్టీ అధ్యక్షులు గాని, ఒక్క నియోజకవర్గ శాసనసభ్యురాలు గాని ఏం జరుగుతుందో.. పరిశీలనకు కూడా రాలేదు. కేవలం ముఖ్యమంత్రి గంటలో హెలిపాడ్ వద్దకు చేరుకుంటారన్న తరుణంలో అంతా అక్కడికి చేరుకొని పుష్పగుచ్చాలు ఇచ్చి వెళ్లిపోయారు. ముఖ్యమంత్రికి ఇంటలిజెన్స్ వారు ఇచ్చిన నివేదిక కూడా ఇదే..!! శ్రీకాకుళంలో రాత్రి బస చేసిన ముఖ్యమంత్రి మరుసటి రోజు ఉదయం ఆల్ గుడ్ అశోక్ అంటూ ముఖ్యమంత్రి మెచ్చుకున్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బాల కార్మికులను చదివించి భావి పౌరులుగా తీర్చిదిద్దుదాం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 7(వార్త):** బాల కార్మికులను చదివించి బావి పౌరులుగా తీర్చిదిద్దుదామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. గురువారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ రోడ్డులో పలు షాపులను తనిఖీ చేసి బాల కార్మికులను నిర్మూలనకు కృషి చేయాలని షాపులో ఉన్న యజమానులకు తెలియజేశారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి శ్రీనివాసరావు, అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.




# ఉద్దానంలో విద్యుత్ వెలుగులు

* 170 గ్రామాలకు నాణ్యమైన కరెంటు సరఫరా * కొర్లాం విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం * రూ.54.22 కోట్లు ఖర్చు.. * రైతులకు 9 గంటల పాటు పగటిపూట ఉచిత విద్యుత్
* కృతజ్ఞతలు తెలిపిన కలెక్టర్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

**ఇచ్ఛాపురం, నవంబర్ 7(వార్త):** శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, కొర్లాం 132/33 కె.వి. విద్యుత్ ఉప కేంద్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో అమరావతి నుంచి గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేశారు. ఇచ్ఛాపురం 132/33 కేవీ ఉపకేంద్రం వేదికగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఐదు విద్యుత్ ఉప కేంద్రాలను ముఖ్యమంత్రి అమరావతి నుంచి ఒకే రోజు ప్రారంభించి మరో 13 కేంద్రాలకు శంకు





స్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ అశోక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖిగా ముఖ్యమంత్రితో మాట్లాడారు. కొర్లాం విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు వల్ల నియోజకవర్గానికి జరిగే మేలును, పక్క నియోజకవర్గమైన పలాసకు కలిగే ప్రయోజనాలను ఎమ్మెల్యే, కలెక్టర్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం నాలుగు మండలాల్లో గల 170గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చుననీ, ఈ ఉపకేంద్రం వల్ల రైతాంగానికి ఎంతోమేలు కలుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి మరింతగా కృషిచేస్తున్నందుకు నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. ముఖ్యమంత్రితో కార్యక్రమం పూర్తయిన అనంతరం జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు.. జిల్లాలోని సోంపేట, కవిటి, కంచిలి, మందస ప్రాంతంలో అధికశాతం గ్రామాలకు పలాస, ఇచ్ఛాపురం ప్రాంత పరిధిలో గల 132/33 కేవీ ఉపకేంద్రాల నుంచి విద్యుత్ సరఫరా ప్రస్తుతం జరుగుతోందన్నారు. సుమారు 170 గ్రామాలు ఈ ఉప కేంద్రాలకి దూరప్రాంతాలు కావటం వలన లోవోల్టేజి సమస్యలు అధికంగా వస్తున్నాయని చెప్పారు. ఇకపై ఉద్దానం ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి, బారువ పర్యాటక కేంద్రాభివృద్ధికి, సోంపేట, కవిటి, కంచిలి, మందస ప్రాంతంలో గృహ నిర్మాణ రంగ అవసరాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కొరకు ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ కొర్లాం ప్రాంతంలో 132/33 కే.వి ఉపకేంద్రాన్ని నిర్మించనున్నారన్నారు. ఇది పూర్తయితే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. అలాగే వ్యసాయానికి పగటిపూట 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయగలుగుతామన్నారు.. లోవోల్టేజీ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని తెలిపారు. దాదాపు మూడు లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కో ఎస్ఈ ఏవి రమణ, కన్స్ట్రక్షన్ ఈఈ ప్రేమ్ చంద్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, విజయనగరం కన్స్ట్రక్షన్ డిఈఈ ఎస్.మన్మధరావు, శ్రీకాకుళం డిఈఈ మంచు శ్రీనివాసరావు, ఏఈఈ నాగేశ్వర రావు, ఏఈ హరీష్ తదితరులు హాజరయ్యారు.

## రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ

**ఇచ్ఛాపురం, నవంబర్ 7 (వార్త):** రానున్న రబీ సీజన్లో ఆరుతడి పంటల కోసం రైతులకు రాయితీపై విత్తనాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్‌తో కలసి బుధవారం పంపిణీ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పర్యటనలో పాల్గొన్న కలెక్టర్ పంటల విత్తనాలను రాయితీపై నియోజకవర్గానికి చెందిన పలు రైతులకు ఈ సందర్భంగా అందజేశారు. అధిక దిగుబడి ఉద్దేశించి వేరుశనగ, మినుము విత్తనాలు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్నందున వ్యవసాయ శాఖ జారీచేసిన సూచనలు. రైతులు పాటించి, అధిక దిగుబడి సాధించాలని, రైతులు ఉత్సాహంగా సాగు చేసి మరింత విస్తీర్ణం పెంచాలని కలెక్టర్, ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కే జగన్ మోహన్ రావు, మండల వ్యవసాయ అధికారులు బి నరసింహమూర్తి, దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకులు మల్లేష్, ప్రవీణ్ , వెంకటేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.






## 10న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలు

* రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికలు
* టౌన్ హాల్ వేదికగా పోటీలు నిర్వహణ
* ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను

**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ 7 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను వెల్లడించారు. ఆ రోజున 38వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ,13వ జిల్లా స్థాయి పూమ్ సే చాంపియన్ షిప్ పోటీలు ఉంటాయన్నారు. బాలురు, బాలికల విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేయనున్నామన్నారు. ఏడేళ్ల నుంచి 11 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న క్రీడాకారులు ఈ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జనవరి 1,2013 నుంచి డిసెంబర్ 31,2017 మధ్య పుట్టిన క్రీడాకారులే ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలియజేశారు. ఇతర వివరాల కోసం తైక్వాండో క్రీడాకారులు కోచ్‌లు గౌతమ్ సెల్ నెంబర్ 8919591487, నవీన్ సెల్ నెంబర్ 9000655520లను సంప్రదించాల్సిందిగా తైక్వాండో శ్రీను కోరారు.

## జానకికి మూడు సెంట్లు ఇండ్ల స్థలం

**ఇచ్ఛాపురం, నవంబర్ 7 (వార్త):** ఈదుపురం గ్రామానికి చెందిన బలిజపల్లి జానకికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు 3 సెంట్ల ఇండ్ల స్థలాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ బెందాలం అశోక్ సంయుక్తంగా లబ్ధిదారురాలకు ఇళ్ల పట్టా పంపిణీ చేశారు. దీపం 2 పథకాన్ని ప్రారంభించేందుకు ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటరి మహిళ పెన్షన్ను ఆమెకు అందజేశారు. ఆమె అభ్యర్థన మేరకు ఇళ్ల పట్టా ఇస్తానని అప్పుడు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ వారం తిరగకుండా అమలు జరిగినందుకు లబ్ధిదారురాలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కలకాలం పేదలకు అండగా ఉంటుందని ఆమె ఆశీర్వదించారు.



# మున్సిపాల్టీ ఆదాయ వనరులు పెంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**ఇచ్ఛాపురం, నవంబరు 7 (వార్త):** ప్రభుత్వ నిధులపై ఆధార పడకుండా మున్సిపాల్టీలో ఆదాయ వనరులు పెంచుకొని అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అదికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని 23 వార్డుల్లో - త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ప్రజలకు త్రాగునీరు అందివ్వాలని చెప్పారు. ఇంటిపన్నులు, ఖాళీ స్థలాలు, టౌన్ ప్లానింగ్ ద్వారా ఆదాయాలను పెంచుకోవాలని సూచించారు. రెవిన్యూ పెంచుకుంటేనే మున్సిపాలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగలమని అన్నారు. రెవిన్యూ బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహించకుండా దృష్టి సారించి పూర్తిస్థాయిలో వసూళ్లను 100% లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రోడ్డుపై తిరుగుతున్న పశువులు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, సిబ్బందికి ఏ ఏ బాధ్యతలు అప్పగిస్తున్నది రికార్డులు నిర్వహించాలని తెలిపారు. దీపం 2 పథకం ద్వారా అర్హులకు పూర్తిస్థాయిలో సిలిండర్లు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్ష లో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్పర్సన్ పిలక రాజ్య లక్ష్మి, కమీషనర్ ఎన్. రమేష్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయండి

**పలాస, నవంబర్ 7(వార్త):** ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) నేతలు కోరారు. పలాసలోని జీడి సంఘ కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కిరణ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. విజయవాడలో డిసెంబర్ 4న ప్రజా హక్కుల ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. దేశ ప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని కోరారు. అనంతరం సోషలిస్ట్ విప్లవ ఉద్యమంలో అమరులకు, ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు. కార్యకర్తలంతా ఉత్తేజంతో, శ్రీకాకుళం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యుడు మద్దిల మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్‌రావు, దున్న శ్రీనివాస్, పి.కామేశ్వరరావు, అప్పారావు, జగదీష్, నాగేశ్వరరావు, దాలమ్మ, జిల్లాలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తం

### -డీఐజీ గోపీనాథ్ జెట్టి

**మందస, నవంబర్7(వార్త):** ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా సైబర్ నేరాలపై చైతన్యం కావాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. వార్షిక తనిఖీ నిమిత్తం మందస పోలీసుస్టేషన్‌కుర గురువారం వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ మోసాల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. మొబైల్ వినియోగదారులను సైబర్ మోసగాళ్లు అత్యంత తెలివిగా బెదిరించడం, బుట్టలో వేసుకోవడం, బలహీనతలను గుర్తించి మోసం చేస్తున్నారన్నారు. ప్రలోభాలకు గురి చేస్తూ ఆశలు చూపుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సేకరించి, ఓటీపీలతో వారి ఖాతాల నుంచి డబ్బును తస్కరిస్తున్నారన్నారు. ఎన్ఐఏ, సీబీఐ పేరిట ఫోన్లు చేస్తున్నారన్నారు. ఇటువంటి ఫోన్లు వస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. పెండింగ్ కేసులు, ఇన్విస్టిగేషన్ రివ్యూ చేస్తున్నామన్నారు. ఐటీ కేసులు, ఘర్షణలు పరిశీలిస్తున్నామన్నారు. పెండింగ్ ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో, అప్పట్లో పని చేసిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్, క్రైం రేట్ తదితర వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎస్ ఆవరణలో మొక్కలను నాటారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ ఎస్కే ఖాదర్‌బాషా ఉన్నారు.





# రైజ్ సంస్థల సేవలు అభినందనీయం

### - ఎమ్మెల్యే గౌతు శిరీష

**మందస, నవంబర్ 7(వార్త):** రైజ్ సంస్థల సేవలు అభినందనీయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రైజ్ సంస్థల సీఈవో డాక్టర్ పుల్లట ప్రవీణ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ కేర్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఈ శిబిరం పెట్టడానికి ముందుకు వచ్చిన ప్రవీణ్‌ను అభినందించారు. వైద్య సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా అందాలన్నారు. సమాజానికి మంచి చేసే పనులు చేయాలని పిలుపునిచ్చారు. ప్రవీణ్ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు.



కార్యక్రమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరానికి వచ్చిన మహిళలకు వైద్యులు ఉచిత స్కానింగ్, స్క్రీనింగ్‌తో పాటు పాప్ స్మియర్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వరాజ్యలక్ష్మి, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

# శివసాగర్ బీచ్ అభివృద్ధికి చర్యలు



**పలాస, నవంబర్ 7(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి రెవెన్యూ భూభాగంలో ఉన్న శివసాగర్ బీచ్ అభివృద్ధికి తహసీల్దార్ స్వామినాయుడు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో శివసాగర్ బీచ్ అభివృద్ధికి ఐదు ఎకరాల స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఆ మేరకు స్థలాన్ని రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నామన్నారు. దశాబ్దాలుగా కలెక్టర్లు, ఆర్డీవోలు మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప.. ఈ బీచ్‌కు ఏ విధమైన మోక్షం కలగడం లేదని, నిధులు మంజూరు కావడం లేదని, కంటితుడుపు చర్యలే మిగులుతున్నాయని ఆయన దృష్టికి తీసుకురాగా, ఆ విషయం టూరిజం శాఖ చూసుకోవాలని సమాధానం ఇచ్చారు.

ఈ పరిశీలనలో ఆర్ఐ వెంకటరావు, అక్కుపల్లి వీఆర్వో కోనేరు కామేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప దీక్షలోనూ ప్రజా సేవ

**పలాస, నవంబర్ 7(వార్త):** పలాస-కాశీబుగ్గలోని మారుతీనగర్‌కు చెందిన సామాజికవేత్త మన్యాల శ్రీనివాస్(ఎంఎస్) నిత్యం ప్రజా సేవలో దూసుకుపోతున్నారు. నేనున్నానంటూ, అభాగ్యులకు అక్కున చేర్చుకుంటున్నారు. రక్తహీనతతో ఓ మహిళ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన అయ్యప్ప దీక్షలో ఉన్నా.. గురువారం ప్రాణదాత బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ఏ ప్రమాదం ఉండదు. అపోహలు నమ్మొద్దు, రక్తదానం చేయండి..ప్రాణాలను కాపాడండి అని యువతకు పిలుపునిచ్చారు.

## పేద కుటుంబానికి 'ఇప్పిలి' ఉదారత



**మందస, నవంబర్ 7(వార్త):** ఓ పేద కుటుంబానికి ఇప్పిలి కేశవరావు(చిట్టి) సాయమందించారు. ఆరోగ్యం బాగాలేక చికిత్స కోసం ఎదురుచూస్తున్న ఓ కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. మందసకు చెందిన పొందర ప్రభాకర్, జానకి దంపతుల 12 ఏళ్ల కుమారుడు ధనుష్క గుండెలో రంధ్రాలు ఏర్పడి, రక్తం చిక్కగా మారిపోతోంది. రక్త ప్రసరణ సరిగా జరగక అనారోగ్య సమస్యలు ఏర్ప డ్డాయి. పేద కుటుంబం కావడంతో సమస్యపై చిట్టి స్పందించారు. రూ.10వేలను ధనుష్ చికిత్స కోసం అందజేశారు. చిట్టి దాతృత్వంపై స్థానికులు అభినందనలు తెలిపారు.

## బాబా ఆలయంలో అన్న సమారాధన



**వంగర, నవంబర్ 7(వార్త):** మడ్డువలస సంజీవని కొండపై వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం మగ్గూరు, జగన్నాథవలస, మడ్డువలస, ఓనె అగ్రహారం, సంగాం, సరసనాపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. పాలాభిషేకాలు గావించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జగన్నాథవలసకు చెందిన మునుకోటి సాయికృష్ణ. కల్పన దంపతుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

## సాయినగర సంకీర్తనలు

**జలుమూరు, నవంబర్ 7(వార్త):** చల్లవానిపేట గ్రామంలో సత్యసాయి భజన సేవ మండల ఆధ్వర్యంలో నిత్యం నగర సంకీర్తన సాగుతోంది. ప్రజల్లో భక్తి భావాలు పెరిగేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంఘ చైర్మన్, కన్వీనర్లు ఆనెం యోగేశ్వరరావు, పంచిరెడ్డి త్రినాథరావు తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మందస, నవంబర్ 7(వార్త):** మందస మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జి.యోగేశ్వరరావు, ఏఈ ఎల్.యోగి తెలిపారు. 11కేవీ ఉద్దానం ఫీడర్, 11కేవీ బాతుపురం పైప్‌లైన్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు. దీంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బహడపల్లి, నారాయణపురం, బిడిమి, రట్టి, మకరజోల, సువర్ణపురం, చిన్నకోస్త, పెద్దకొస్త, తాళ్లగురంటి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## నేడు చెట్ల కొమ్మల తొలగింపు

**వంగర, నవంబర్ 7(వార్త):** బూరాడ నుంచి సరసనాపల్లి గ్రామం వరకు ఉన్న 33 కేవీ పవర్ లైన్‌కు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను శుక్రవారం తొలగిస్తామని వంగర ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు గురువారం తెలిపారు. నేడు ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలగకుండా లైన్ క్లియర్ చేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.



## ఘనంగా సీవీ రామన్ జయంతి వేడుకలు

**జలుమూరు, నవంబర్ 7(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రామన్ గొప్పతనాన్ని, కృషిని విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వంగర మండల సమావేశం వాయిదా



**వంగర, నవంబర్ 7(వార్త):** ఈనెల 11వ తేదీన జరగాల్సిన వంగర మండల సర్వసభ్య సమావేశాన్ని 17కు వాయిదా వేశారు. ఈనెల 11 నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మండల సమావేశం నిర్వహించడానికి అవకాశం లేక వాయిదా వేసినట్టు ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీడీవో లోపింటి త్రినాథరావు గురువారం తెలిపారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఐసీపీఎస్ కో-ఆర్డినేటర్ జనార్ధనరావు అన్నారు. గురువారం ఆయన జలుమూరు మండల పరిషత్ ఆవరణలో డ్వాక్రా మహిళలకు ప్రస్తుతం అమలువుతున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళాల రక్షణకు ఎటువంటి చట్టాలు ఉన్నాయి, బాలికల రక్షణకు ఎటువంటి చట్టాలు ఉన్నాయో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

**వంగర, నవంబర్ 7(వార్త):** రైతుల భూసమస్యలు పరిష్కరించడానికే రీసర్వే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ డి.ధర్మరాజు తెలిపారు. గురువారం ఆయన కొప్పరవలస గ్రామంలో సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి గంగాభవాని, మండల సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

**మందస, నవంబర్ 7(వార్త):** ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండ లంలోని నర్సింగపురంలో గురువారం జరిగిన విశ్వశాంతి బ్రహ్మయజ్ఞం, నూతన ఆశ్రమ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అలేఖ్నాధువులు ఎంతో కఠోరమైన నిష్ఠతో జీవితాన్ని సాగిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అలేఖ్యములు వేకువ జామున నిద్ర మేల్కొని, పురాణ పురుషుల జీవితాలను గుర్తుకు తీసుకువస్తారన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ఆమె ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# రేవుల ఆక్రమణల తొలగింపు



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** శ్రీముఖలింగం గ్రామంలోని తీర్థ రేవులన్నీ ఆక్రమణకు గురయ్యాయి. దీనిపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు 30 అడుగుల వరకు ప్రతి తీర్థ రేవును బాగు చేయిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ సతీష్ కోరారు. గ్రామము నుంచి వంశధార నదికి వెళ్లే 12 రహదారుల్లో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో దేవా మాస్టర్, టి.బలరాం, చి.కేశవ, జి.కర్ణ, ఎస్.వేణు, కె.హరిప్రసాద్, జి.సింహాచలం, వెంకటేశం మాస్టర్, గిరి మాస్టారు, ఈశ్వరరావు మాస్టారు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మద్యం షాపుల సిబ్బందికి వేతనాలు చెల్లించాలి



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** గతంలో ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన సిబ్బందికి బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కొన్న శ్రీనివాసరావు, ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు బి.సంతోష్ కోరారు. నరసన్నపేటలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్టి దృష్టిలో ఉంచుకొని వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కష్టపడి పనిచేశారన్నారు. అలాంటి వారికి ఉద్యోగాలు లేకుండా చేయడం అన్యాయమని, వారికి బకాయి పడ్డ జీతాలు, బోనస్‌లు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా వైన్స్ షాప్ సూపర్‌వైజర్ అండ్ హెల్పర్స్ యూనియన్ నరసన్నపేట నియోజకవర్గ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.వాసుదేవరావు, కార్యదర్శిగా టి.తిరుమలరావు, ఉపాధ్యక్షులుగా జి.రాజారావు, కె.రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా వై.రామారావు, కె.క్రాంతికుమార్, కోశాధికారిగా బి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మాజీ వీసీ

**పలాస, నవంబర్ 7(వార్త):** పలాస మండలం రామకృష్ణాపురంలో అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ విద్యార్థులకు స్వయంగా ఇంగ్లీష్ గ్రామర్ క్లాసులు నిర్వహించారు. సత్యసాయి విద్యావిహార్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 9వ క్లాసు విద్యార్థినులకు రూ.34 వేల చెక్కులను ఆయన విద్యార్థినులు సిద్ధికా, హరీష్ గాంధీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నవారు లేనివారితో తమకున్న ఆర్థికశక్తిని, జ్ఞాన విజ్ఞానాలను పంచాలని, సమాజహితంగా ప్రతీ వ్యక్తి జీవన విధానం కొనసాగించాలన్నదే సత్యసాయి అవతార సందేశమని అన్నారు.

కార్యక్రమానికి సత్యసాయి విద్య విహార్ డైరెక్టర్ రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, టీచర్లు విద్యార్థులు హాజరయ్యారు. సత్యసాయి అవతార ప్రకటనకు సంబంధించి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులతో నిర్వహించారు.

# 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**మందస, నవంబర్ 7(వార్త):** ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరారు. మందస మండలంలోని హరిపురంలో వారు శిరీషకు వినతిపత్రం అందజేశారు. సిబ్బందికి నాలుగు నెలల జీతాలు పెండింగ్ ఉండడంతో వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని, వేతనాలు తక్షణమే అందేలా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం నాయకులు గోపాలకృష్ణ, మురళీమోహన్, శంకర్, రామచంద్రా రెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు ముమ్మర ఏర్పాట్లు



**వంగర, నవంబర్ 7(వార్త):** రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని సివిల్ సప్లై డీటీ పిన్నింటి రామారావు తెలిపారు. గురువారం ఆయన వంగర పీఏసీఎస్ సెంటర్‌ను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పక్కాగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు జరగాలని సూచించారు. ఇప్పటికే సంబంధిత అధికారులతో ఒకటి, రెండు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా చూడాలని కోరారు.

# గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

### -మున్సిపల్ కమిషనర్ రామారావు



**కాశీబుగ్గ, నవంబర్ 7(వార్త):** గృహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. గురువారం ఆయన పురపాలక కార్యాలయంలో అర్బన్ హౌసింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారిని చైతన్యపరిచేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహలు సకాలంలో పూర్తి చేసినవారికి బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వైరల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రసన్న లక్ష్మి తెలిపారు. గురువారం సుబ్రహ్మణ్యపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో స్థానిక గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలతో పాటు మందులు కూడా అందజేశామన్నారు. సుమారు 56 మందికి పరీక్షలు నిర్వహించామని ఆమె స్పష్టం చేశారు.



## అల్లాడలో 85 మందికి వైద్య పరీక్షలు

**జలుమూరు, నవంబర్ 7(వార్త):** జలుమూరు మండలం అల్లాడ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని సైరిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి హేమలత తెలిపారు. జిల్లా శాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో గురువారం చేపట్టిన వైద్య శిబిరంలో 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశామని ఆమె స్పష్టం చేశారు.

## తిమడాంలో సత్యసాయి పల్లకి సేవ



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 99వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా జలుమూరు మండలంలోని తిమడాంలో పల్లకి సేవ గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సత్యసాయి ఆధ్యాత్మిక విభాగం కోఆర్డినేటర్ గుప్త అశ్విని మాట్లాడుతూ.. 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన పల్లకి సేవ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలోని భక్తులు మంగళహారతులతో స్వామివారి పల్లకిని ఆహ్వానించారు.

## లోపాలు ఉంటే సరిదిద్దుతాం'



**జలుమూరు, నవంబర్ 7(వార్త):** భూ సమస్యలను ఆయా గ్రామాల రైతుల వద్దకు వెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ డి.సత్యనారాయణ తెలిపారు. నరసన్నపేట మండలం కరగాం పంచాయతీలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుతామన్నారు. రైతుల వద్ద నుంచి సుమారు 42 అర్జీలు స్వీకరించామన్నారు.

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

**జలుమూరు, నవంబర్ 7(వార్త):** నరసన్నపేటలోని చిత్రీ వీధి వద్ద ఉన్న సత్యసాయి మందిరంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం సత్యసాయి 99వ జన్మదినాన్ని పురస్కరించుకొని శిబిరం ఏర్పాటు చేశామని కన్వీనర్ నాగేశ్వరరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర సంస్థ ద్వారా నిర్వహించిన శిబిరంలో సుమారు 168 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 24 మంది నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413